# షాక్ థెరపీ

ఆంధ్రప్రతిక 14-12-79

మనోవ్యాధికి అబద్దం మందయినప్పుడు అబద్దం చెప్పడంలో తప్పులేదు.

—జయప్రద

---

"చూడు.... చూడు శ్యామలీ! బాబుకు పాలిచ్చి చాలా సేపయినట్లుంది."

"యిస్తాలే అమ్మా నాకు.... నాకు.... ఆ పాప కూడా కావాలి"

తను అడగాల్సింది అడిగేసి తల్లి జవాబుకొరకు తన పాలిపోయిన కళ్ళెత్తి ఆతృతగా చూస్తోంది శ్యామలి.

శ్యామలి తల్లి మాట్లాడ లేదు. ఆమె ప్రశ్న విననట్టే ఊరుకుంది.

"నాకా పాప కావాలి. నువ్వు ఆ పాప నెక్కడిచ్చావు? ఏ అనాథ శరణాలయంలో. చెప్పమ్మా!"

శ్యామలి తల్లి మాట్లాడలేదు. మాట్లాడటానికి కావలసిన శక్తిని కూడదీసుకుంటోంది ఆమె.

"మాట్లాడవేమ్మా?"

"ఏం మాట్లాడేది? ఆనాడు మిమ్మల్ని ఆ బిడ్డను తీసేదాకా ఊపిరి ఆడనివ్వకపోతివి" సన్నగా గొణిగింది శ్యామల తల్లి.

"నిజమే.... నిజమే. నా తప్పు నేను ఒప్పుకుంటున్నాను.... ఈయనను వెళ్ళి ఆ పాపను....... ఆ పాపను తీసుకు రమ్మని చెప్పమ్మా."

"..........."

"అమ్మా !"

"ఏమిటీ నీ పిచ్చి శ్యామలీ? ఏదో శరణాలయంలో యిచ్చేశాం.... ఆ తర్వాత నీకు చెప్పానుగా ఎవరో అడిగి తీసుకెళ్ళారని. మాటిమాటికి మమ్మల్నెందుకు విసిగిస్తున్నావ్ నువ్వు."

బిత్తరపోయి చూసింది శ్యామలి.

"నువ్వు.... నువ్వు అమ్మా! నువ్వు కూడా నన్ను విసుక్కుంటు న్నావా? నీకు కూడా నేను భారమయిపోయానా?"

అలా అనేసిన శ్యామలి వీపు మీద ఎవరో ఛెళ్ళున చరిచినట్టు ఉలిక్కిపడింది.

"అమ్మ!" రెండేళ్ళ క్రితం తొలిసారిగా అమ్మ అయిన తను ఏం చేసింది?

పాలు త్రాగడానికి కూడా తెలియని పసికందును ఎంత నిర్దయగా వెళ్ళగొట్టింది.

కూతురు కళ్ళలో తిరుగుతున్న నీళ్ళ సుడిని చూసిన శ్యామలి తల్లి చలించిపోతూ అంది.

"లేదు.... లేదు తల్లీ శ్యామూ నిన్ను నేను విసుక్కుంటానా ? నువ్వే నాకు భారమయిపోతావా అమ్మా"

ఆర్ద్రంగా, ఆర్తిగా, పలుకుతున్న తల్లి వంక జాలిగా, ప్రేమగా చూస్తున్న శ్యామలి కళ్ళలో భావం క్షణంలో మారిపోయింది.

"ఇలాటి.... ఇలాటి ఆప్యాయతకు శాశ్వతంగా దూరమైన ఆ బిడ్డే ఎక్కడుందో! తన బ్రతుకు తను బ్రతకడానికి కనీసం కళ్ళయినాలేని, ఆ ఆడపిల్ల ఎలా ఎలా బ్రతుకుతోందో!"

శ్యామలి వెక్కిళ్ళ శబ్దానికి వులిక్కిపడింది శ్యామలి తల్లి.

"అమ్మా శ్యామూ! నేనేం చేసేది చెప్పు. ఆ బిడ్డ అక్కడుంటే తెచ్చి నీ ఒడిలో వేసేదాన్ని.... నా తప్పుకు ప్రాయశ్చిత్తం చేసుకునేదాన్ని."

వెక్కిళ్ళ మధ్యగా శ్యామలి తల్లిని కుదుపుతూ అంది.

"అమ్మా! పాపను ఎవరు తీసుకెళ్ళుంటారంటావు?"

కూతురు ప్రశ్నతో లేని ఉత్సాహాన్ని తెచ్చుకుందామె. శ్యామలి రేగిపోయిన తల సరిచేస్తూ అంది–

"ఎవరో ధనవంతులే తీసికెళ్ళుంటారు శ్యామూ ! మన పాపకు కళ్ళు ఆపరేషను చేయించి...."

తల్లిని మధ్యలోనే ఆపేసి తల అడ్డంగా ఊపింది శ్యామలి. "కాదు.... కాదు అంత అవసరం వాళ్ళకేం పట్టింది. కన్నతల్లిని నేనే ఆ పని చేయాలేకపోయాను. వాళ్ళకు బిడ్డలే కావాలంటే చక్కటి బిడ్డలు దొరక్కపోతారా?

ఈ అవిటి బిడ్డ కావాల్సి వస్తుందా? నాకు తెల్సు.... నాకు తెల్సు ఎవరో బిచ్చగాళ్ళు అమ్మా"

ఇక చెప్పలేక కన్నీళ్ల కుండ పగిలినట్టు, గుండె ఆగినట్టు తల్లిని అంటుకుపోయింది శ్యామలి.

బిడ్డకు జవాబు చెప్పే శక్తి, ఆమెను ఓదార్చే భాష తన దగ్గర లేనట్టు బిడ్డ వెన్ను సవరిస్తూ నిశ్శబ్దంగా వుండిపోయిందామె.

"అవునులేమ్మా. బిచ్చగాళ్ళకు తప్ప నా బిడ్డ యెవరికి ఉపయోగ పడుతుంది ?"

గొంతులో చేరిన కన్నీళ్ళతో తడిసి వస్తున్న ఆ మాటలు తల్లి గుండెలను పిండేస్తున్నాయి.

"శ్యామూ పడుకోమ్మా! నా మాట విను తల్లీ!"

* * * *

"నువ్వే.... మీరే....మీరే ఆనాడు నాకు కాన్పు చేసింది" వెర్రిగా

డాక్టర్ అరుణ కళ్ళలోకి చూస్తున్న శ్యామలి మానసిక అవస్థ క్షణంలో అర్థమైంది ఆమెకు.

"నీ పేరు.... నీ పేరు శ్యామలి కదూ! నీ కొరకేనమ్మా నేను ఇన్నాళ్ళుగా ఎదురు చూస్తున్నాను"

"నా కొరకా?"

"అవునమ్మా. నువ్వు క్షమిస్తానంటే నీకో మాట చెప్తాను. నువ్వు కనబడితే చెప్పాలనీ నా గుండె బరువు దించుకోవాలనీ చాలా రోజుల నుంచీ ఎదురు చూస్తున్నాను. దేవుడు పంపినట్టు నీవే వచ్చావు"

"డాక్టర్"

"అవునమ్మా రెండేళ్ళ క్రితం నీ గుడ్డి బిడ్డను మీ అందరి బాధా చూడలేక నేనే ఓవర్ డోస్ ఇంజక్షనిచ్చి చంపేశాను"

"చంపేశారా!"

శ్యామలి గొంతు నీరసంగా వున్నా వుండాల్సినంత షాక్ ఆ స్వరంలో లేదు.

"క్షమించు శ్యామలీ! నీ ఒడికే భారమైన ఆ బిడ్డను ప్రపంచపు ఒడిలో వదిలిస్తే ఆ బిడ్డ ఎదుర్కొనబోయే సమస్యలను వూహించి అలా చేశాను."

"డాక్టర్" శ్యామలి విభ్రాంతిగా చూసింది.

శ్యామలితో పాటు శ్యామలి తల్లి ఆశ్చర్యంగా, అనుమానంగా డాక్టర్ వేపు చూసి వెంటనే తన బిడ్డ శ్యామలి ఏమయిపోతుందో అన్నట్టు గబుక్కున ఒక్క అడుగేసి శ్యామలి రెండు భుజాలు పట్టుకుంది.

"అయితే.... అయితే ఎక్కడో అనాధ శరణాలయంలో యిచ్చేశానని...."

శ్యామలి గొంతులో చిత్రమైన స్పందన.

"అవును. నువ్వు ఆ షాక్‌కు తట్టుకోలేవని నేనే అలా చెప్పమన్నాను."

ఐదు నిముషాల తర్వాత— తల్లి ఆసరాతో-గాని నడవలేక నడచి వచ్చిన శ్యామలి, తల్లి చేయి పట్టుకోవాలనే స్పృహ లేకుండా మెల్లిగా నడిచి వెళుతోంది.

శ్యామలిని అనుసరిస్తున్న శ్యామలి తల్లి చటుక్కున తల తిప్పి డాక్టరు వేపు చూసింది. డాక్టర్ అరుణ వెళుతున్న శ్యామలిని గమనిస్తోంది.

* * * *

"అమ్మా! మిమ్మల్ని డాక్టరుగారు పిలుస్తున్నారు. ఏదో మందు చీటీ మర్చిపోయారట" శ్యామలి కార్లో సర్దుకుని కూర్చున్నాక శ్యామలి తల్లిని పిల్చింది నర్సు.

తనచేతిలో వున్న ప్రిస్క్రిప్షన్ పేపర్ వంక, నర్సువంక మార్చి మార్చి చూస్తున్న శ్యామలి తల్లిని మరొక్కసారి హెచ్చరించింది నర్సు.

"రండమ్మా! మరలా డాక్టర్‌గార్కి టైమయితే రౌండ్స్ వెళ్ళి పోతారు" మరో మాట ఆమె అనే అవకాశం ఇవ్వకుండా శ్యామలి తల్లి చేయిపట్టుకుని తీసుకెళ్ళింది.

నిద్రలో నడిచి వస్తున్నట్టు నడిచి వస్తున్న ఆమెను దయగా, చిరునవ్వుతో చూసిన డాక్టర్ అరుణ ఆమె కూర్చున్నాక నిదానంగా అంది—

"ఈ పరిస్థితుల్లో నాకు అబద్ధం చెప్పక తప్పలేదు. మీకు మీ బిడ్డ దక్కాలంటే ఈ అబద్ధం తప్ప మరో మందు లేదు. మీరు నిశ్చింతగా వుండండి"

"డాక్టర్! ఈ బిడ్డకు ఈ విషయం విన్నాక షాక్ రాదంటారా?"

"షాక్ రావడం కాదమ్మా! శ్యామలి ఇప్పుడు షాక్‌లో వుంది. తన బిడ్డ అనామకంగా ఎక్కడో ఏ బిచ్చగత్తె చేతిలోనో బ్రతుకుతుంది అనే భ్రమ.

ఆ ఆడపిల్ల పెరిగి పెద్దదయి ఎలాటి నికృష్టపు బ్రతుకు బ్రతుకుతుందోననే భయం ఆమెని నరకయాతన పెడుతున్నాయి.

ఈ మానసిక దౌర్బల్యంనుంచి కోలుకోవడానికి ఇది షాక్ థెరఫీ"

"డాక్టర్‌గారూ!"

—

"అవునమ్మా! మీరు నిన్న ఫోన్‌లో చెప్పిన విషయాలు విన్నాక నేను చేసుకున్న నిర్ణయమిది. నా మందు తప్పక పనిచేస్తుందని నాకు నమ్మకముంది"

ఆమె చేతులు జోడించింది.

జోడించిన ఆ చేతులు డాక్టర్‌గారికి నిశ్శబ్దంగా కృతజ్ఞతలు తెలుపుతున్నట్టున్నాయి.

కారులో శ్యామలి ఇన్నాళ్ళకు గుండెలనిండా వూపిరి పీల్చుకుంటోంది.